క్లుప్తంగా...

చాంద్రాయణగుట్ట ఏసీపీగా మనోజ్‌కుమార్



చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పాటైన చాంద్రాయణగుట్ట సబ్ డివిజన్‌కు తొలి ఏసీపీగా మనోజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సౌత్ జోన్‌లోని ఫలక్‌నుమా డివిజన్ పరిధిలోకి వచ్చే చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ను ఆ డివిజన్ నుంచి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నూతనంగా చాంద్రాయణగుట్ట డివిజన్‌ను ఏర్పాటు చేసి.. దీని పరిధిలోకి చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్, నూతనంగా ఏర్పాటైన బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లను కలిపారు. ఈ డివిజన్‌ను సైతం సౌత్ ఈస్ట్ జోన్‌లోకి కలిపారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఆశీష్‌కుమార్ యాదవ్



అబిడ్స్: సీఎం కేసీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ కలిశారు. శనివారం ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసి గోషామహల్ నియోజకవర్గం రాజకీయ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని హెరిటేజ్, పురాతన కట్టడాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. హెరిటేజ్ కట్టడాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

అవార్డులు గుర్తింపునిస్తాయి



పురస్కార గ్రహీతలతో దైవాజ్ఞశర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అవార్డులు సమాజంలో గుర్తింపును ఇవ్వడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిని కలిగిస్తాయని సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ అన్నారు. శనివారం శిఖం ఆర్ట్ థియేటర్స్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాగర అలలపై పురస్కారాల పరిమళాన్ని పేరిట పలువురికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీవీ నిర్మాతల మండలి అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీమణి, నటుడు ప్రసాద్‌బాబు, సంస్థ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు రచయిత్రులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కె.ఝాన్సీ రచించిన ఎడారి చినుకు, చీకటి వెన్నెల పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పలు సామాజిక అంశాలను ఎంతో అద్భుతంగా కవిత్వం, కథల రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కె.నిర్మల, సమ్మెట ఉమా, కళా తాటికొండ, పింగళి చైతన్య, మానస, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కారు బీభత్సం.. వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: మద్యం మత్తులో కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నేతాజీ నగర్‌లో నివాసముండే రాఘవేంద్రరెడ్డి(28) ఓ ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజాము 2 గంటల నుంచి మణికొండలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహించాల్సి ఉంది. అర్ధరాత్రి 12 దాటాక ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై లంగర్‌హౌస్ మీదుగా మణికొండకు వెళ్తున్నాడు. సంగం వద్ద నుంచి వెళ్తుండగా అత్తాపూర్ నుంచి బాపూఘాట్‌బ్రిడ్జి మీదుగా ఓ కారు వేగంగా దూసుకువచ్చింది. అయితే సంగం రోడ్డు వద్దకు రాగానే రోడ్డు నేరుగా ఉందనుకొని ముందుకు వేగంగా వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రాఘవేంద్రరెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. కారుకు, డివైడర్‌కు మధ్య నలిగి తీవ్రగాయాలతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అంతటితో ఆగక కారును తిప్పి పారిపోయే ప్రయత్నంలో మరో కారును ఢీకొట్టాడు. మద్యం మత్తులో ఉన్న కారు నడిపిస్తున్న వ్యక్తిని వాహనదారులు పట్టుకోగా వారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. మృతుని భార్య మంగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

అందుబాటులో ఆధునిక ప్రసూతి వైద్యం

- పేట్లబురుజులో ఆన్‌లైన్‌లో ఓపీ వైద్య సేవలు
- రోజురోజుకూ పెరుగుతున్న రోగులు.. సరిపోని వైద్య సౌకర్యాలు
- పెరుగుతున్న రోగులకు అనుగుణంగా పెరగని సిబ్బంది



పేట్లబురుజులోని ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

చార్మినార్: పాతబస్తీ పేట్లబురుజులోని ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మహిళలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. గతంలో జడ్జీఖానా పేరుతో నయాపూల్‌లో కొనసాగిన ఈ ప్రసూతి ఆస్పత్రిని పాతబస్తీ పేద మహిళలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేట్ల బురుజులో ప్రత్యేక వసతులతో కూడిన భవన నిర్మాణం చేపట్టి ఈ ఆస్పత్రిని ప్రారంభించారు. 467 పడకల ఈ ఆస్పత్రిలో రౌండ్ ది క్లాక్ వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ఈ ఆస్పత్రి నయాపూల్ బ్రిడ్జి సమీపంలోని హైకోర్టు భవనం పక్కన ఉండేది. అప్పట్లో దీనిని జడ్జీఖానా అనే వారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు చెందిన గర్భిణులు ప్రసూతి ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఆస్పత్రిని ఆధునీకరించిన అనంతరం పాతబస్తీ రోగులతో పాటు శివారు ఉమ్మడి జిల్లాలైన రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల గర్భిణులు ఎక్కువగా వైద్య సేవలు పొందుతున్నారు.

అందుబాటులో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు..

ఇక నుంచి రోగులు గంటల తరబడి ఆస్పత్రిలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయి. 9848790714, 9848790719, 9818766013 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి తమ పేరును ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. తమకు వచ్చే రిప్లై ప్రకారం ఆస్పత్రికి వెళ్లి రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో అది చూపించి ఓపీ కార్డు పొందవచ్చు.

తగ్గని దోమల బెడద..

రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు సరిపోవడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది. దోమల బెడద అధికంగా ఉండడంతో రాత్రిపూట ఆస్పత్రి ప్రాంగణంతో పాటు వార్డుల్లో రోగులతో పాటు వారి అటెండెంట్స్ ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య లోపంతో పాటు పక్కనే మూసీనది ప్రవహిస్తుండడంతో దోమల స్వైర విహారం ఎక్కువగా ఉంది. దీనికి తోడు కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

అందుబాటులో ఉన్న వైద్య సేవలు ఇవీ..

- గర్భిణులకు అత్యవసర వైద్య సేవలు.
- ఇన్ పేషంట్, అవుట్ పేషెంట్ సౌకర్యం.
- ప్రతిరోజూ ఉదయం అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందుతాయి.
- అవుట్ పేషెంట్ విభాగం మూసిన అనంతరం అత్యవసర కేసులను రౌండ్ ది క్లాక్ తీసుకుంటారు.
- సాధారణ ప్రసవాలు.
- గర్భిణుల అవసరం మేరకు అత్యవసర శస్త్ర చికిత్సలు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా చేస్తారు.
- మల, మూత్ర, రక్త పరీక్షలతో పాటు ఎక్స్‌–రేలను ఉచితంగా నిర్వహిస్తారు.

ఆస్పత్రి వివరాలు..

- ఆస్పత్రి ఎక్కడుంది: సిటీ కాలేజీ చౌరస్తాలో (పేట్లబురుజు చౌరస్తా)
- అవుట్ పేషంట్ విభాగం: ప్రతిరోజూ ఉదయం–8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పాత పేషెంట్స్‌తో పాటు కొత్త పేషంట్స్.
- అత్యవసర సేవలు: రౌండ్ ది క్లాక్
- ఆదివారం: అవుట్ పేషెంట్ విభాగం ఉండదు.
- ప్రత్యేకం: ప్రసవం, కుటుంబ నియంత్రణ, గైనిక్ సంబంధ వ్యాధులు, గర్భిణుల కోసం.
- ప్రత్యేక విభాగం: రాజీవ్ ఆరోగ్యశ్రీ.
- యాక్సిడెంట్ కేసులు: స్వీకరించబడవు.
- రవాణా సౌకర్యం: నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్ సౌకర్యం

తప్పుడు ప్రచారాలు నమ్మకండి



సమావేశంలో పాండుయాదవ్, భీశ్వ ఓంప్రకాష్, లాల్‌సింగ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై కొంతమంది తమకే టికెటు వచ్చిందని తపుడు ప్రచారాలు చేసుకుంటున్నారని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్, కార్పొరేటర్ లాల్‌సింగ్, ఇతర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి పార్టీలో పనిచేస్తున్న వారికే బీజేపీ టికెటు లభిస్తుందని వారన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎవరో అగ్ర నాయకులు పరిచయం ఉన్నారని, తనకే టికెటు వస్తుందని గ్లోబల్ ప్రచారాలు చేసుకుంటున్న వ్యక్తిని ఏ మాత్రం నమ్మొద్దని కార్యకర్తలకు సూచించారు. గోషామహల్ బీజేపీ టికెటు నియోజకవర్గంలో సీనియర్ నాయకులు, కష్టించి పనిచేసే కార్యకర్తలు, ముఖ్య నాయకుల అభిప్రాయం మేరకే పార్టీ అధిష్టానం టికెటు కేటాయిస్తుందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునందన్ యాదవ్, నరహరి, గోపాల్, నిర్మల్‌రాజ్, వివేకనంద పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



టేబుల్ టెన్నిస్ క్రీడలను ప్రారంభిస్తున్న హోంమంత్రి, ప్రిన్సిపల్ రేవ్ బ్రదర్ షజాన్ ఆంటోని తదితరులు

అబిడ్స్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. శనివారం అబిడ్స్‌లోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలను ప్రిన్సిపాల్ రేవ్‌బ్రదర్ షజాన్ ఆంటోనితో కలిసి ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రేవ్‌బ్రదర్ షజాన్ ఆంటోని మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో కూడా రాణించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్తేకార్ శరీఫ్, మహ్మద్ ఇబ్రహీం ఖాన్, కేకే.మహేశ్వరి, పి.నాగేందర్‌రెడ్డి, ప్రకాష్‌రాజ్, నరేష్‌రెడ్డి, జయప్రకాష్, దీపేష్ సింగ్, లిటిల్‌ఫ్లవర్ పాఠశాల క్రీడల ఆర్గనైజింగ్ సెక్రెటరి బీటీ అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవకు ఆదిత్య ట్రస్ట్ అంకితం



ఆర్థిక సాయం అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం ప్రజలకు ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఆ ట్రస్ట్ చైర్మన్ గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. 20 ఏళ్లుగా నియోజకవర్గం నలుమూలలా పేద బడుగు వర్గాల ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నామన్నారు. భారీ వర్షాలకు మంగళ్‌హాట్ గుఫా నగర్‌లో కొన్ని పెంకుటిళ్ల గోడలు కూలిపోవడంతో నందకిశోర్ వ్యాస్ బిలాల్ సందర్శించారు. బాధితులకు ట్రస్టు తరఫున నగదు రూపంలో ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం తరఫున బాధితులకు న్యాయం జరిగే విధంగా, వారిని ఆదుకునే విధంగా తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మోహన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, తుల్జారామ్ సింగ్, కవిత బుజ్జి అక్క, శైలేష్ పాల్గొన్నారు.

క్రీడా వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

గన్‌ఫౌండ్రీ: ఈనెల 24న మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో క్రీడా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం రవీంద్రభారతిలో క్రీడా వేడుకల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే మంత్రి వర్గ సమావేశంలో నూతన క్రీడా పాలకులను ప్రకటించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద క్రీడా కారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈనెల 24న వివిధ క్రీడా సంఘాలతో కలిసి నెక్లెస్ రోడ్డులో సైక్లింగ్, ఇందిరాపార్కులో స్కేటింగ్, యూసుఫ్‌గూడలో రెజ్లింగ్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న శశియాదవ్

చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కందికల్ గేట్ బోయిగూడకు చెందిన ఎం.శివ ప్రసాద్(శశి) యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు బద్దుల బాబురావు, యువజన అధ్యక్షుడు రమేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, యువజన కో ఆర్డినేటర్ గొర్ల యశ్వంత్ రాజు యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కూలిన ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి ప్రహరీ

నాంపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి ప్రహరీ కూలిపోయింది. ఈ ఘటన రాత్రి వేళలో జరగడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. పట్టపగలు కూలిపోయి ఉంటే తద్వారా జరిగే పరిణామాలు మరోలా ఉండేవని స్థానికులు పేర్కొంటున్నారు. కూలిపోయిన ప్రహరీ పక్కనే ఆర్టీసీ బస్టాపు కూడా ఉంది. ఆర్టీసీ బస్టాపుపై కూలడంతో పూర్తిగా ధ్వంసమైంది. కూలిపోయిన ప్రహరీని పునర్ నిర్మించాలని స్థానికులు, రోగి సహాయకులు కోరుతున్నారు.



ధర్నాను విజయవంతం చేయండి



విజయ్ కుమార్

గౌలిపురా: కేంద్ర ప్రభుత్వం లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న ఢిల్లీలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని లింగ బలిజ సంఘం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లింగ బలిజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

చాంద్రాయణగుట్ట: అనుమానాస్పద స్థితిలో భవనం పైనుంచి కార్మికుడు కిందపడి మృతి చెందిన ఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన అవన్ కుమార్(26), తన భార్య చంద్రావతితో కలిసి వలస వచ్చి చందూలాల్ బారదారిలో నివాసం ఉంటున్నాడు. అతడు మేస్త్రీగా పని చేస్తుండగా.. అతని భార్య పార పని చేస్తుంది. శనివారం మిశ్రీగంజ్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఐదంతుల భవనంలో పనికి వెళ్లి.. నాలుగో అంతస్తులో పని చేస్తున్నాడు. ఐదో అంతస్తులో సెంట్రింగ్ డబ్బా కొడుతున్నారు. ఎందుకో ఐదో అంతస్తు పైకి వెళ్లిన అవన్ కుమార్ ఒక్కసారిగా కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వర్షాకాలంలో అధికారులు తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా, ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పైప్‌లైన్ పనుల కారణంగా ప్రధాన రహదారుల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ట్రాఫిక్‌ను నియంత్రించడంలో ట్రాఫిక్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. టోలిచౌకి చౌరస్తా వద్ద రోడ్డుకు 4 వైపులా కూడా పార్కింగ్ నియంత్రణకు సిబ్బంది లేరని, దీని వల్ల టోలిచౌకి చౌరస్తా దాటాలంటే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. టూంబ్స్ రోడ్డు, నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకి, గోల్కొండ బంజార దర్వాజా తదితర ప్రాంతాలు ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని, ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పక్కా చర్యలు తీసుకోవాలని ఆయన టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్‌కు సూచించారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, డిప్యూటీ ఈఈ రామకృష్ణ తదితరులున్నారు.

‘మణిపూర్‌లో హింసకు బీజేపీదే బాధ్యత’

గోల్కొండ: మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న హింసకు అక్కడి బీజేపీ ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. శనివారం కార్వాన్ బాంజ వాడిలో మణిపూర్ హింసపై కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులను వారి గ్రామాల నుంచి పారద్రోలి అక్కడ గనులపై కబ్జా చేయడానికే గిరిజనులను ఊచకోత కోస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, నర్సింహులు, రవీందర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రార్థనలు

గోల్కొండ: మొహర్రం నెల ముస్లింలకు ఎంతో పవిత్రమైన నెల అని రిసాల బజార్ ఆషుర్‌ఖాన్ ప్రతినిధి పాషాభాయ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఆషుర్‌ఖానాలో మొహర్రం ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా గోల్కొండలోని వివిధ ప్రాంతాల వారు ఆలంలను సందర్శించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి పనిసంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆలంలకు దట్టి సమర్పించారు.



రిసాలబజార్‌లో కొలువుదీరిన ఆలంలు

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఈ సంవత్సరం గోల్కొండ కోట బోనాల సందర్భంగా జగదాంబిక మహంకాళి అమ్మవారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం వచ్చింది. శనివారం హుండీని లెక్కించారు. 9 పూజలకు గాను రికార్డు స్థాయిలో రూ.12,83,423 లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. గత సంవత్సరం హుండీ ద్వారా రూ.9,45,000 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

బీబీకా అలావా, బర్గా హజ్రత్ అబ్బాస్‌ల సందర్శన



డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని డబీర్‌పురాలోని బీబీకా అలావా, బర్గా హజ్రత్ అబ్బాస్‌ల(ఏఎస్)ను శనివారం సెల్‌–ఇ–బాబుల్ యాకీన్ మౌలానా సయ్యద్ వహీద్ ఉద్దీన్ హైదర్ జాఫ్రీ, ఖిబ్లా అఖ్బారీ సందర్శించారు. ఆయనతో పాటు బర్గా హజ్రత్ అబ్బాస్ ముతవల్లీ మీర్ హైదర్ అలీ మూష్వి, సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్, మాజీ అడ్వొకేట్ జనరల్ మీర్ లుక్మాన్ అలీ, న్యాయవాది మీర్ హైదర్ అలీ జాఫ్రీ, షియా అస్నా అషారీ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫ్రంట్ అధ్యక్షులు హతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిలక్‌మాత ఆలయంలో బోనాల ఉత్సవాలు

డబీర్‌పురా: డబీర్‌పురా ఫర్హత్‌నగర్‌లోని ఫిలక్‌మాత ఆలయంలో ఆదివారం ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎ.కృష్ణకుమార్ తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని సర్వాంగా సుందరంగా అలంకరించారు. ఆదివారం బోనాలు సమర్పించేందుకు భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తుల బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు.

జూపార్కును సందర్శించిన లోకేశ్ జైశ్వాల్



గంధపు చెట్ల నరికివేతను పరిశీలిస్తున్న లోకేశ్ జైశ్వాల్, జూ అధికారులు

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కును వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్, పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్ శనివారం సందర్శించారు. జూపార్కులో 20న గంధపు చెట్ల చోరీ, జూలో జరిగిన అభివృద్ధి, వన్యప్రాణులకు తీసుకుంటున్న చర్యలను స్వయంగా జూలో తిరుగుతూ తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ వన్యప్రాణుల ఆరోగ్యంపై తగిన సూచనలు, సలహాలు చేశారు. జూ అధికారులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. జూపార్కులో అక్రమంగా ఏడు గంధపు చెట్లను నరికిన ఘటనల్లో బాధ్యులను గుర్తించి కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జూపార్కులోని ఫారెస్ట్ స్టాఫ్, సెక్యూరిటీ సిబ్బంది గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వన్యప్రాణుల ఆరోగ్యం, సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్, పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్ హర్షం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్, ఐఎస్ఎఫ్ విజయ్ కుమార్, జూ డైరెక్టర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్, మాజీ క్యూరేటర్ శంకరన్ పాల్గొన్నారు.

రాజు వస్తాద్‌కు సేవా అవార్డు

గోల్కొండ: సేవ చేసే వారినే ప్రజలు గుర్తిస్తారని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గోల్కొండ కోట ఆషాఢ బోనాల ఉత్సవాల్లో సేవలు అందించిన సందర్భంగా గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు ఎస్.రాజు వస్తాద్‌కు ఆయన ఉత్తమ సేవా అవార్డు అందించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను విజయవంతం చేయడంలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల పాత్ర ఎంతో ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి కమిటీ అధ్యక్షుడు ఆబెద్, మీర్జా అహ్మద్ బేగ్, ఇలియాజ్ అక్బర్, పరమానందం, వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులున్నారు.



అవార్డు అందజేస్తున్న గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన సోఫియా, బ్యాగరీ సంఘం ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు నారీ నికేతన్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు సోఫియా ముందుకొచ్చి ఆదర్శంగా నిలిచారు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధురాలు తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో సోఫియా, భాగ్యనగర్ బ్యాగరీ సంఘం ప్రతినిధులు మహేశ్వర్, సాయినాథ్, ప్రదీప్‌కుమార్, అజయ్ కుమార్, వీరేంద్ర, సురేందర్, సాయి, సందీప్ చాంద్రాయణగుట్ట నల్లవాగులోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయనగర్‌కాలనీ: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మేయర్, మెహదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజిద్ హుసేన్ అన్నారు. ఆసిఫ్‌నగర్ జిర్రాలో మహ్మద్ సలావుద్దీన్ ఆబెద్ ఏర్పాటు చేసిన నిశ్చల్ డయాగ్నొస్టిక్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజలకు అందుబాటులో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అగ్రసేన్



బ్యాంక్ చైర్మన్ నవీన్‌కుమార్ అగర్వాల్, మహ్మద్ మూసా, సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిండు కుండలా శాతం చెరువు



గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండులా మారాయి. గోల్కొండ కోట నయాఖిలాలోని శాతం చెరువులో భారీగా వరదనీరు చేరింది. కాగా అధికారులు రెండు రోజులుగా నీటితో నిండిన శాతం చెరువును సందర్శిస్తున్నారు. చెరువులో చేరిన వర్షపు నీటిని చెరువు తూము ద్వారా కందకంలోకి వదులుతున్నారు. నీరు కందకాల నుంచి నాలాలో కలుస్తున్నది. చెరువులో చేరుతున్న వరదనీటిని చూసి నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. ముందు జాగ్రత్తగా వారు తమ తమ విలువైన వస్తువులను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. మరికొందరు వర్షాలు వరుసగా కురుస్తుండటంతో చెరువుని ఆనుకుని ఉన్న వారు ఇళ్లకు తాళాలు వేసి తమ బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఇదిలా ఉండగా షేక్‌పేట్‌లోని కొత్త చెరువు సైతం వరదనీరు వచ్చి చేరుతుంది.